Assembles Of The Living Elohim, India Presents.................


SATYAMUNAKAI PORATAM REGD. NO. 67970/97 REGD. MONTHLY NEWSPAPER

# సత్యమునకై పోరాటం

Postal Regd. No. H/APM/01 Valid upto December 2009
Posted on 30th of Every Month
Annual Subscription Rs.50/-

To
Bro./Sis,

A.O.T.L.E. India, Malikipuram



Editor & Publisher : Bro. Isaac E. Kusuma,
MALIKIPURAM - 533 253
E.G.Dt. (A.P.) India
E-mail : aotleindia@rediffmail.com
Phone : 08862-227613
Cell : 98493-85038, 99493-00230

VOLUME : 10 September 2006 Pages : 4 Issue : 105

# ఆది అపోస్తలుల సమాజము ఏది? -2

## ఆది సమాజములలోనికి గుంట నక్కల ఎంట్రన్సు ఎలా జరిగింది?

ఈ గుంటనక్కలను గూర్చి యషువ మెస్సీయ ముందే చెప్పాడు. మత్తయి 7:15,16 అపోస్తలుడైన సౌలు కూడా హెచ్చరించాడు. అ॥కార్య॥ 20:29,30.

గుంటనక్కల గురువైన సాతాను ఆదిలో ఏదేను తోటలో ఇది నిజమా? అంటూ హవ్వను మోసగించినట్లే ప్రతి తరములోను ప్రజలను మోసగిస్తూనే వస్తున్నాడు. వీడు సర్వలోకమును మోసపుచ్చు మోసగాడు ప్రకటన12:9.

యషువ మెస్సీయ సేవాకాలంలో వీడు శాస్త్రులు - పరిసయ్యులు - సద్దూకయ్యులు - ప్రధాన యాజకులు మొదలగు వారిలో నుండి పని చేసాడు. అటులనే వీడు భక్తిపరుల రూపంలోనే ఉన్నాడు. బైబిలు ఏకత్వాన్ని బోధిస్తుంటే వీడు దిత్వాన్ని (తండ్రి వేరు - కుమారుడు వేరు అని బోధించుట) త్రిత్వాన్ని (తండ్రియైన దేవుడు - కుమారుడైన దేవుడు పరిశుద్ధాత్ముడైన దేవుడు; ముగ్గురు అంటూ ఆ ముగ్గురూ ఒక్కరే అని బోధించుట) ప్రవేశపెట్టి ప్రజలను / విశ్వాసులను దారి తొలగిస్తున్నాడు. దిత్వాన్ని గాని త్రిత్వాన్ని గాని నమ్మేమీరు నేనడిగే ఈ ప్రశ్నకు వాక్యప్రకారం సమాధానం ఇవ్వగలరా? అట్లైనచో తండ్రియైన దేవునికి సంబంధించిన 12 రిఫరెన్సులు, కుమారుడైన దేవునికి సంబంధించిన 12 రిఫరెన్సులు అటులనే పరిశుద్ధాత్ముడైన దేవునికి సంబంధించిన 12 రిఫరెన్సులు మీరు వ్రాసి పంపించండి. మీరు వ్రాసే రిఫరెన్సులతోనే మీరు నమ్మింది ఎంత అబద్దమో ఎలా అబద్దమో మీకు నేను వాక్యంతోనే ఋజువుచేసి చూపిస్తాను.

| | తండ్రియైన దేవుడు | కుమారుడైన దేవుడు | పరిశుద్ధాత్ముడైన దేవుడు |
|---|---|---|---|
| 1. | | | |
| 2. | | | |
| 3. | | | |
| 4. | | | |
| 5. | | | |
| 6. | | | |
| 7. | | | |
| 8. | | | |
| 9. | | | |
| 10. | | | |
| 11. | | | |
| 12. | | | |

చర్చి ఆఫ్ గాడ్ అంటే దేవుని సంఘము, యావె సమాజము, యెహోవా సాక్షులు మొదలగు వారు దిత్వాన్ని బోధిస్తారు. దిత్వమంటే తండ్రివేరు - కుమారుడు వేరు అని బోధించుట.

యావె సమాజ సభ్యునితో ఒకసారి నేను మాట్లాడుతూ; **ఆది యందు ఎలోహీం భూమ్యాకాశములను సృజించెను అని ఆది 1:1లో** ఉంది గదా! ఈ ఎలోహీం ఎవరు? అని అడిగాను.

యావె అన్నాడు.

యావె అంటే ఎవరు అన్నాను

తండ్రి అన్నాడు.

ఆది కాండం 2:17 తీసి **“నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించినది” ఎవరు**? అని అడిగాను యావె అన్నాడు.

అయితే హెబ్రీ 9:16,17 ప్రకారం మరణ శాసనము వ్రాసినవాడే మరణమవ్వాలి గదా! మరి మరణమయ్యింది తండ్రియైన యావెయా? లేక కుమారుడైన యషువయా? అని అడిగితే సమాధానం లేదు. కొంతసేపు పోయాక మీరు నన్ను కన్ఫ్యూజ్ చేస్తున్నారు అన్నాడు. నేను వాక్యాన్ని ఇన్ఫ్యూజ్ చేస్తున్నాను. కన్ఫ్యూజ్ చేయడం నా అభిమతం కాదన్నాను. బైబిలు నుండే ఒక చిన్న ఉదాహరణ వ్రాస్తున్నాను చూడండి. పాత నిబంధన గ్రంథం నుండి 325 ప్రవచనాలు తీసుకొని క్రొత్త నిబంధన వ్రాసారు. ఒక స్థలము నుండి వేరొక స్థలమునకు కాపీ చేసినప్పుడు బైబిల్ సొసైటీ అనువాదకులు చేసిన మోసమును మీరు గ్రహించాలి.

| యెషయా 40 :3 | మత్తయి 3:3 / లూకా 3:6 |
|---|---|
| ఆలకించుడి, అడవిలో ఒకడు ప్రకటించుచున్నాడు. ఎట్లనగా<br>- అరణ్యములో యావెకు మార్గము సిద్ధపరచుడి. ఎడారిలో మా ఎలోహీం రాజ మార్గము సరాళము చేయుడి. | **ప్రభువు** మార్గము సిద్ధపరచుడి ఆయన త్రోవలు సరాళము చేయుడని అరణ్యములో కేకవేయు నొకని శబ్దము<br>- **ప్రభువు** మార్గము సిద్ధపరచుడి ఆయన త్రోవలు సరాళము చేయుడి.<br>అని అరణ్యలో కేకలు వేయుచున్న యొకని శబ్దము. |

ఈ రెండు వాక్యాల్లో ఉన్న తేడాను గమనించండి. యావె వేరు - యషువ వేరని బోధించే యావె సమాజం వారు దీనికి ఏ సమాధానం చెపుతారు?

యెషయా; యావెకు మార్గం సిద్ధం చేయమంటున్నాడు. ఆయనను ఎలోహీం అని యెషయా వ్రాస్తున్నాడు. కరెక్టుగా ఉన్నది ఉన్నట్లుగా కాపీ చేస్తే **ప్రభువు** అనే మాట దగ్గర యావె అని ఉండాలి. అప్పుడు యావె ఎవరు యషువ కాదా? యావె సమాజం వారి ఆలోచన సరళి ఎలావుంది? వాక్యం కన్నా దిత్వసిద్ధాంతం మీదే ఉంది కాదంటారా?

ఒకసారి ఏలూరులో యావె సమాజం వారి మీటింగ్‌కు మా సమాజమంతా వెళ్ళాము. మా సమాజమంతా కలిసి ఒక పాట పాడారు. ఆపాట విన్న సమాజ ఎల్డర్ మా వాళ్ళను కించపరిచాడు. అది తెల్సుకున్న నేను అదే పాటను అదే స్టేజి మీద మరల పాడాను. కామెంట్ చేస్తే వాక్యంతో వాయించేద్దామనుకున్నాను. ఏమీ మాట్లాడలేదు. ఇంతకీ ఆ పాట ఏమిటి అంటారా?

యావె రాజు యషువగ జన్మించె- పరిపూర్ణ తేజముతో
లోకానికిదియె పర్వదినం- ఇదియే మహోదయం
పరిశుద్ధుడు పరమాత్ముడు - సత్య సంపూర్ణుడై
పరలోకరాజ్యము చేర్చుటకు - తన ప్రేమను తెలుపుటకై ॥యావెరాజు॥

యెషయా 40:3 లోని, యావె మత్తయి 3:3 / లూకా 3:6 లోని యషువ కాదంటారా? దిత్వము, త్రిత్వము అనునది అన్య ఆచారం నుండి వచ్చినది. 10 ఆజ్ఞలలో మొదటి ఆజ్ఞ ఏకత్వమును ఋజువు పరుస్తుంది. యావె సమాజ సోదరులారా! మీరు దుఃఖపుత్రులు (ఆది 35:18) గా ఉండకండి.

సహోదరుల మధ్య గురుగులు చల్లకండి. మనిషి ఎదురుగా షలోం బ్రదర్ అని పలకరించి అతని వెనుక చెడు మాట్లాడటం సహోదరులకు తగదు. నిజ నిజాలు తెల్సుకోకుండా అబద్ధాలను ప్రచారం చేసి సహోదరుల హృదయాలు గాయపరచకండి. బ్రదర్ నేను సున్నతి చెయ్యించుకున్నాను. నాకుమారునికి సున్నతి చెయ్యించాను మా పిల్లలు సబ్బాతు రోజున స్కూలుకి వెళ్ళరు. మేము చాలా నిష్ఠ కలిగి జీవించేస్తున్నాము. అని గొప్పలు చెప్పకండి. క్రొత్త నిబంధన ప్రకారం సున్నతి పొందమని బైబిలు చెప్పడం లేదు. ఆది అపోస్తలులు అన్యజనులకు సున్నతి అవసరం లేదని లేఖ వ్రాసారు. అ॥కార్య॥ 15 అధ్యాయం. అపోస్తలుడైన సౌలు సున్నతి సంబంధుల కొరకు, వారి తప్పుడు బోధ కొరకు రోమా, ఎఫెస్సీ, గలతీ, ఫిలిప్పీ మొదలగు పత్రికలలో బహుగా ఖండించాడు. అపోస్తలుల కాలంలోనే అబద్ధ బోధలు ఉన్నాయి. అందులో సున్నతి ఒకటి అ॥కార్య॥ 15:1, సున్నతి సంబంధులే అపోస్తలుల బోధకు వ్యతిరేకంగా ఉన్నారు. అ॥కార్య॥ 15:24. వీళ్ళ పని ఏమంటే సహోదరుల మనస్సులు చెరపడం, సున్నతి పొందితేనే గాని రక్షణ లేదనడం, మోయలేని కాడిని విశ్వాసులపై మోపి ఎలోహీంను శోధించడం పరమతండ్రి వైపు తిరుగు వారిని కష్టపెట్టడం, విశేష వివాదమును తర్కమునకును దిగడం, శరీర విషయంలో ఉప్పొంగడం, భిన్నమైన సువార్తతో విశ్వాసులను చెరిపి కలవరపర్చడం, కపట సహోదరులు గనుక రహస్యంగా దొంగతనంగా సున్నతి పొందమని (గలతీ 2:4) బోధలు చేస్తూ విశ్వాసులను దారి తప్పిస్తూ కలవరపరుస్తూ ఉంటారు. దాస్యమను కాడి క్రిందికి (గలతీ 5:1-5) విశ్వాసులను లాగుతూ మెస్సీయ కృప నుండి బహుగా వేరుపరుస్తూ ఉంటారు. మెస్సీయ యొక్క మ్రాను విషయమై హింస పొందకుండుటకు మాత్రమే సున్నతి పొందమంటూ బలవంతం చేస్తూ ఉంటారు. గలతీ 6:12. అపోస్తలుడైన సౌలు సున్నతి సంబంధులను కుక్కలని, దుష్టులైన పనివారని ఫిలిప్పీ 3:2-3లో ధృవీకరించాడు. గనుక సబ్బాతు సంఘాలలోని ఈ కుక్కలను, దుష్టులైన పనివారిని మనం గమనించి వారి తప్పుడు బోధను ఖండించవలసి ఉన్నది. సున్నతి అను దొంగబోధను గూర్చి **“సున్నతి పొందితేనే గాని రక్షణ లేదా?”** అనే కరపత్రము కొరకై మాకు వ్రాయండి. పూర్తి వివరాలు అందులో ఉన్నాయి.

ఇలా గుంట నక్కలు సమాజాలలో బయలుదేరి అపోస్తలుల కాలంలోనే చాలా సమస్యలు సృష్టించాయి. నేడు కూడా ఈ గుంటనక్కలు సబ్బాతు సమాజాలలోని బలహీనమైన విశ్వాసులను పట్టి సున్నతి చెయ్యించుకోమంటూ దొంగ బోధలు చేస్తూ వారికి సున్నతి చేయిస్తున్నారు. ఇది ఆది అపోస్తలుల బోధకు వ్యతిరేకమైనది. పైగా అపోస్తలుల ద్వారా ఇది (సున్నతి) ఖండించబడినది.

దిత్వ సిద్దాంతమును (తండ్రి వేరు – కుమారుడు వేరు అని నమ్ముట) నమ్మే ఒకడు వచ్చి ఒకసారి నాతో వాదిస్తున్నాడు. తండ్రిపైన ఉన్నాడు కుమారుడు క్రింద ఉన్నాడు. ఇద్దరూ ఒక్కటే అని ఎలా అంటున్నావు అన్నాడు. పది ఆజ్ఞలలో మొదటి ఆజ్ఞ ఏమిటో చెప్పు అన్నాను. నిర్గమ 20:1–4, ద్వితీ 5:6–10 తీసి చదవమన్నాను. ఇశ్రాయేలీయుల షమా (ద్వితీ 6:4,5) వచనాలు చదివించాను. ఇందులో ఎక్కడైనా “మేము” అనే పదం ఉందా? లేక “నేను” అనే పదం ఉందా? అని అడిగాను. నేను అనే ఉంది అన్నాడు. అద్వితీయుడు అంటే ఏమిటి అని అడిగాను ద్వితీయుడు కానివాడు అన్నాడు. రెండవ వాడు కాని మొదటి వాడేనా? అంటే అవునన్నాడు. మరి బైబిల్లో మన స్వరూపమందు, మనపోలిక చొప్పున అని (ఆది 1:26) ఉందే అన్నాడు. ఇలా మన అనే మాటలు ఆది 3:22, 11:7, యెషయా 6:8 మొదలగు ప్రదేశాలలో కనిపిస్తాయి. అక్కడ చాలా జాగ్రత్తగా చదివి చూస్తే నీకు తండ్రి – కుమారుడు కనిపించరు. వేరొకరు కనిపిస్తారు. అదెవరో నీకే బాగా అర్థం అవుతాది. జాగ్రత్తగా చదివిందే పదిసార్లు చదివి దాని జవాబు కొరకై ఎలోహీంకు ప్రార్థించు అన్నాను. చాలా మందికి అవి అర్థం కాక త్రిత్వమున్నదని భ్రమపడుతున్నారు. యావె సమాజం వారు దిత్వమున్నదని ఊహించుకుంటున్నారు. మరికొంతమందైతే “ట్రయూన్‌గాడ్” అని అంటున్నారు. ఇవన్నీ వాళ్ళ ఊహలను / వాళ్ళ భ్రమపరచు ఆత్మను బట్టి వాళ్ళు కల్పించుకుంటున్న క్రొత్త క్రొత్త పదములే తప్ప, ఏకత్వాన్ని, నమ్మలేని వాళ్ళ అవిశ్వాసమే తప్ప మరేమీ కాదు.

పాత నిబంధన ప్రకారము ప్రధాన యాజకుడు ఒకరు – గొఱ్ఱెపిల్ల మరొకటి. ప్రధాన యాజకుడు గొఱ్ఱెపిల్లను చంపి దాని రక్తమును తీసుకొని యావె ఆలయంలోనికి ప్రవేశించెడివాడు. అవునా?

మరి క్రొత్త నిబంధన ప్రకారం ప్రధాన యాజకుడు ఎవరు అని అడిగితే.......? యషువ మెస్సీయ అన్నాడు. (హెబ్రీ 4:14–15, 7:26–28) మరి గొఱ్ఱెపిల్ల ఎవరు అని అడిగితే.....? గొఱ్ఱెపిల్ల కూడా ఆయనే అన్నాడు. (యోహాను 1:36, ప్రకటన 5:6) ప్రధాన యాజకుడు ఆయనే, గొఱ్ఱెపిల్లకూడా ఆయనే అయ్యినప్పుడు తండ్రి – కుమారుడు ఆయన కాలేదా? (మత్తయి 11:27, లూకా 10:22) అని అడిగితే...... ఆలోచించాలండి అన్నాడు. ఆదికాండం దగ్గర నుండి ప్రకటన గ్రంథం కడవరకూ పరమ తండ్రి ఒక్కడుగా ఎన్నిసార్లు, ఇద్దరుగా ఎన్నిసార్లు, ముగ్గురిగా ఎన్నిసార్లు కనబడుచున్నాడో రిఫరెన్సులన్నీ క్రమంగా ఎసైన్‌మెంట్ వ్రాసి నాకు చూపించు అప్పుడు నీ సందేహాలన్నీ చాలా తేలికగా తీర్చగలను అన్నాను. ఏ బోధకుడనూ, (ఆఖరిని నన్నుకూడా) నమ్మకు. అటులనే నిన్ను నీ స్వంత అభిప్రాయములను నమ్ముకోకు. బైబిలేమి చెపుతుందో అదే నీవు నమ్ము అన్నాను. సరే అన్నాడు. వెళ్ళిపోయాడు. ఇంతవరకూ మరలా ఎక్కడా రాలేదు. ఎవడో ఏదో చెపుతుంటే నమ్మడం, గంగిరెద్దులా తల ఊపడం, పోవడమే గాని, స్వతసిద్ధంగా బైబిలు చదివి అందులో ఏముంది? అది ఏమి చెప్తుంది? అని పరిశీలనగా చదివేవారు చాలా చాలా తక్కువ.

నా చిన్నతనంలో (నేను 6వ తరగతి చదువుతున్న రోజుల్లో) పదవ తరగతి చదువుచున్న ఒక కుర్రాడు “లవర్” అంటే ఏమిటి? అని నీవు ఎవరినైనా అడిగి నాకు చెప్పు అన్నాడు.” సరే అడిగి చెపుతాను అన్నాను. మా తెలుగు బ్రాహ్మణ మాస్టరు పాఠమంతా చెప్పేసి మీకేమైనా సందేహాలుంటే అడగండి అన్నాడు. ముందు పాఠములోని సందేహాలన్నీ తీర్చుకున్నాను. తర్వాత సార్ “అవర్” అంటే ఏమిటండీ? అని అడిగాను. ఒక్కసారిగా నావైపు చాలా కోపంగా చూచి, ఒరే ఇలా రారా అన్నాడు. వెళ్ళాను. నా తల మోకాళ్ళమధ్య పెట్టి వంగమన్నాడు. కొద్ది సేపటికి నా నడుము బాధ వస్తుంది గనుక సర్ధుకుంటున్నాను. వెంటనే ఒక ఇటుక తీసుకొచ్చి నా నడుముపై పెట్టి, ఇటుక పడిందంటే చితుకబాదుతాను అన్నాడు. ఎంతసేపు ఉండగలను? అప్పుడు ఆలోచించుకుంటున్నాను. ఏమిటీ మాట? ఎందుకింత శిక్ష? ఇది నేనడగరాని మాటా? లేక ఏమిటిది? అని నాలో నేను ఆలోచించుకుంటున్నాను. ఆ బాధ అలాగే తట్టుకుంటున్నాను. ఈలోగా బెల్ కొట్టేసారు. ఆయన గారు లేచి వెళ్ళిపోతున్నారు. నేను లెగిసిపోయి ఆయన వెనక వెళ్తున్నాను. ఏమిటిరా! నా వెనుకే వస్తున్నావు? అన్నాడు. సార్ నామాటకి మీరు శిక్ష విధించారు గాని సమాధానం చెప్పలేదు అన్నాను. మరళా క్లాస్‌కి వస్తాను గదా అప్పుడు చెపుతానురా అన్నాడు. నాకు ఆయనపై అనుమానం వచ్చింది. మరళా వచ్చి మరళా అలా నన్ను బాధిస్తాడేమో గనుక ముందుగానే ఆ పదానికి అర్థం నేనే వేరే విధంగా తెల్సుకొని రెడీగా ఉండాలని తలంచుకొని, ఆరోజు లైబ్రరీకి వెళ్ళి ఇంగ్లీషు – తెలుగు డిక్షనరీ తిరగేసి ఒక పుస్తకంలో దాని భావము పేజీనంబర్‌తో సహా నోట్ చేసుకొని వచ్చాను. రెండవరోజు క్లాస్‌కి వచ్చిన మాస్టారు ఒరేయ్ రారా! నిన్నటిలాగే తలమోకాళ్ళ మధ్య మెట్టి వంగమన్నాడు. మరి ఇటుక సార్ అన్నాను తెచ్చుకొని నీకు నీవే నీ నడుముపై పెట్టుకోరా అన్నాడు.

నేను థైర్యంగా నిలబడి “సార్, నేను నాతలను మోకాళ్ళమధ్య పెట్టి వంగను. ఇటుక నా నడుంపై పెట్టుకోను” అని చెప్పాను. ఒక కుర్రాడ్ని పిలిచి తూటుకర్ర తెమ్మన్నాడు. నన్ను బాదడం మొదలెట్టాడు. “సరే, మీరు చెప్పినట్లే చేస్తాను అని” ఇటుక తెచ్చి దాన్నిరెండుముక్కలుగా చేసి, ఒక ముక్క తీసుకొని లాగిపెట్టి కొట్టేసరికి తప్పించుకుని క్లాస్ నుండి పారిపోయాడు. ఆ పోవడం, పోవడం, హెడ్మాష్టారు గారి దగ్గరకు పోయాడు.

అప్పుడు నాతో చదువుకుంటున్న వాళ్ళతో “లవర్” అంటే ఏమిటో (ప్రేమికుడని) చెప్పాను. అప్పుడు హెడ్మాష్టారు దగ్గర ధైర్యంగా విషయం అంతా చెప్పి నా బట్టలు విప్పి తను కొట్టిన దెబ్బలు చూపించాను. ఆ తర్వాత హెడ్‌మాస్టారు అడిగారు అసలు ఎందుకొచ్చిందీ గొడవ అని; పదవ తరగతి చదువుతున్న కుర్రాడి ఇంగ్లీషు పాఠంలో ఈ పదం వాడికి అర్థమవ్వలేదు. వాడికి టీచర్‌ని అడిగే ధైర్యంలేక నాద్వారా తెల్సుకోవాలని ప్రయత్నించాడు. నాకు తెలియక తెలుగు మాస్టారుని అడిగాను. ఇది విషయం అని చెప్పాను దానికి ఇంత రాద్ధాంతం.

బోధకులతో కూడా ఇదే రాద్ధాంతం అయ్యిపోయింది. అడిగిన వాటికి సమాధానం చెప్పలేరు గాని ఎదుటి వారిని బాధిస్తూ ఉంటారు. నమ్మిన దానిని ఋజువు చెయ్యలేరు. అడిగిన దానిని చెప్పలేరు. త్రిత్వము – దిత్వము ఇది పెద్ద సబ్జెక్టా? ఋజువు చెయ్యలేని దద్దమ్మలకు ఎందుకీ సిద్ధాంత విభేధం? గుడ్డి ఎద్దు చేలో పడి మేసిందట అలా గుడ్డి ఎద్దులా బైబిలు అక్కడ అక్కడా చదువుతారు. ఆ చదివిన దానినే నెమరువేస్తూ ఉంటారు. అదే సత్యమని భ్రమిస్తూ పెద్ద ఫోజులు ఇస్తూ ఉంటారు. ఒక క్రమ పద్ధతిలో బైబిలు చదివితే ప్రతీది అర్థం అవుతాది.

క్రైస్తవ్యం అంటేనే పెద్ద చెత్త. క్రైస్తవ బోధకులు బోధించే అన్ని సిద్ధాంతాలూ వాక్యవిరుద్ధమే. బైబిలు చెప్పే దానికి వీళ్ళు చెప్పేదానికి అసలు సంబంధమే లేదు. సత్య సంబంధులు అంటున్న వాళ్ళు కూడా వాక్యం ద్వారా మోసగాళ్ళుగా ఋజువు అవ్వుతున్నారు. ఆది అపోస్తలుల బోధ అసలు వీళ్ళకి తెలియనే తెలియదు. తెలియజెప్పినా వీళ్ళు నడవరు.

మేమే ఆది అపోస్తలుల సిద్ధాంతములను బోధిస్తున్నది అంటూ చాలా గుంపులు / గ్రూపులు లేచాయి. అందులో పెంతెకోస్తు వారు, మొదటి కోవకు వస్తారు. కాని ఇందులోనే అనేకమైన గ్రూపులు / మిషనులు. వీళ్ళకసలు ఆది అపోస్తలుల బోధే తెలియదు. విల్లియం బ్రన్‌హామ్ గ్రూపు యేసునామం. ఇదీ మోసమే. క్రీస్తు సంఘమనే వారున్నారు. వీళ్ళ కసలు తల–తోక తెలియదు.

వీళ్ళందరూ యూదా పత్రికలోని 3వ వచనం తీసుకొని **“పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని”** చెపుతూ మనలనందరినీ మోసం చేసారు. చేస్తూన్నారు. ఇక ముందునూ అదే పనిలో కొనసాగుతూ ఉంటారు.

**ఆది అపోస్తలులు :** ఆయన నామము నిమిత్తము పోరాడారు. అ॥కార్య॥ 4:18. యెరూషలేంలో అపోస్తలులు ఆయన నామమును యేసు చెప్పారా? లేక యషువ అని బోధించారా? అపోస్తలులంతా యషువ మెస్సీయ నామంలో బాప్తిస్మం యిస్తే వీళ్ళంతా ఏ నామాలలో ఇస్తున్నారు బాప్తిస్మం? వీళ్ళది అపోస్తలుల బోధ ఎలా అవుతుంది? **మీరు నమ్మినా నమ్మకపోయినా క్రైస్తవ నాయకులలోను – బోధకుల్లోనూ సాతాను ఉంది. మీరు వాక్యం ద్వారా నిలదీసి అడగండి. వాడు బయటకు వస్తాడు.** టి.వి. చూస్తే తప్పు అని బోధిస్తుంది ఒక పెంతెకోస్తు సంఘం.

టి.వి. తప్పయితే ఆటోమోబైల్స్ వాడడం తప్పుకాదా? ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తప్పు కావా? ఏమి పిచ్చిబోధ ఇది? టి.వి. చూడకూడదట. టి.వి.లో బోధించకూడదట. ఇది అపోస్తలుల బోధా? ఇలాంటి విషయలా అపోస్తలులు బోధించినవి? టి.వి. హానికరమైతే, మీరు ఉపయోగించే ఇతర వస్తువులు కార్లు, మోటరుసైకిళ్ళు, ఫోన్‌లు, సెల్‌ఫోన్లు, ఇవి తప్పు కావా? ఏ విశ్వాసీ వాళ్ళను నిలదీసి అడగడు. విశ్వాసులు తప్పుడు బోధకులకు బానిసలు. **సాతాను ఎలా పనిచేస్తుందో మీకు తెలుసా? సంస్థను నడిపించే హెడ్‌లో ఉంటాడు. అటులనే సంఘ కమిటిలో ఉంటాడు. సంఘ పెద్దలలో ఉంటాడు. వాళ్ళ ఆలోచన సరళి బైబిల్ వాక్యానికి వ్యతిరేకంగా ఉందంటే వాళ్ళలో సాతాను ఉన్నట్లే. అలా సాతాను వాళ్ళలో ఉండి వాడి ఆలోచనలను వారి ద్వారా సఫలీకృతం చేసుకుంటూ ఉంటాడు. కాని చూచే / జనాంగమునకు వీరు గొప్ప భక్తుల్లా కనిపిస్తూ ఉంటారు కాని వాస్తవానికి భక్తిముసుగులో ఉన్న సాతానులు వీరే. (2 కొరింథీ 11:13,14,15).**

పరలోక రాజ్య మార్గము చాలా ఇరుకైనది గనుక అనేకులు ప్రవేశింప చూస్తారే గాని అది వారి వలన కాదని వాక్యం ఖండితంగా చెప్తుంది. కొదువైన వాటిని చూపించే సరికి ధనవంతుడు వ్యసనపడిపోయాడు. భక్తిపరులకు వారు చేసే తప్పుడు పనులు ఎత్తి చూపిస్తే వెంటనే సాతాను అనుచరులుగా రూపం మార్చుస్తారు. ధర్మశాస్త్రము – ఆజ్ఞలు అంటూ గొప్పలు చెప్పే వారికి వారు అనుసరించవలసిన ఇతర ఆజ్ఞలు చూపిస్తే వారు మొత్తానికే వెనక్కి వెళ్ళిపోతారు.

పెంతెకోస్తు పండుగ దినమున జరిగిన సంఘటనను (అ॥కార్య॥ 2:1) ఆదారం చేసుకొని “పెంతెకోస్తు సంఘాలు” ఏర్పడ్డాయి. పెంతెకోస్తు పండుగ బైబిలు క్యాలెండరును బట్టి వస్తుంటాది. మరి పెంతెకోస్తు సోదరులు భాషలుకి ప్రాముఖ్యత ఇచ్చారే గాని బైబిలు క్యాలెండరుకు ఇవ్వలేదే? అయినా ఆరోజు వారు మాట్లాడిన భాషలు మిగతా వారికి అర్థమయ్యాయి గదా! (అ॥కార్య 2:11). మరి వీరి భాషలు ఎవరికీ ఎందుకు అర్థం కావడం లేదు. ఈ విమర్శకు పెంతెకోస్తు వారు మౌనం దాల్చడం సాతాను పని కాదంటారా? పెంతెకోస్తు పండుగను సౌలు ఆచరించాడు. (అ॥కార్య॥ 20:16, 1కొరింథీ 16:9). మరి వీరు పెంతెకోస్తు పండుగను ఆచరించరే? పైగా బైబిల్లో ఆది అపోస్తలులు ఆచరించని పండుగలు వీరు ఆచరిస్తూ వీరి బోధ అపోస్తలుల బోధ అంటే ఎవరు నమ్ముతారు? వాక్యము నెరుగని వారే వీరిని నమ్ముతారు. అందుకే పెంతెకోస్తు సంఘాలకు ఆది అపోస్తలుల వాక్యం తెలియదని, వారి బోధ అపోస్తలుల క్రమం కాదని ఋజువు అవ్వుతుంది. పెండ్లిచేసుకొనని పెంతెకోస్తు వారి మోసం కూడా చూద్దాం! వీరు కూడా పై వారి వలె కొంచెం ఎక్కువ మోసం భక్తిరూపంలో చేస్తున్నారు.

మోసానికి వేషం అవసరం. గొఱ్ఱె చర్మం ధరించిన ‘తోడేళ్ళు’ అన్నాడు మెస్సీయ. అపోస్తులుల వేషం (2కొరింథీ 11:13–15) అన్నాడు సౌలు. గనుక మోసం చెయ్యాలన్నా, మోసపోవాలన్నా వేషం చాలా అవసరం. మోసగాళ్ళంతా భక్తిపరుల్లా మంచి వేషదారణ చేస్తూ ఉంటారు.

పెంతెకోస్తు వారు ఎక్కువగా భాషలు – పరిశుద్ధాత్మ వరాలు – అంటూ గొప్ప హంగు ఆర్భాటం చేస్తూ ఉంటారు. నిజానికి వీళ్ళకీ సత్యము తెలియదు. తెలియజెప్పినా నడవరు. **ఎందుకంటే వాళ్ళు కూడా వాళ్ళ పెద్దలు (నకిలీ అపోస్తులులు) చెప్పిన మాటలే వింటారు గాని వాక్యం చెప్పినట్లుగా నడవరు.**

పరిశుద్ధాత్మ కేవలం పాపమును గూర్చి, నీతిని గూర్చి, తీర్పును గూర్చి మాత్రమే చెపుతూ ఉంటుంది. యోహాను 16:8. ఈ పరిశుద్ధాత్మను పొందడానికే పాపం చాలా తిప్పలు పడిపోతున్నారు. ఓ పాట ఉందనుకోండి ఆఖరి చరణం వరకూ స్లోగా పాడటం, ఇక ఆఖరికి వచ్చేసరికి డ్రమ్ము బాగా స్పీడుగా కొట్టడం పాట వేగంగా పాడటం అందులోంచే ఏవేవో నత్తిమాటలు / అన్యమాటలు మాట్లాడటం, పెద్ద పెద్ద అరుపులు, కేకలు వెయ్యడం శరీరాన్ని కుదుపుకోవడం చేసేస్తే ఆత్మ పొందేసినట్లే. అని భ్రమపరుచుకుంటూ ఇతరులను భ్రమపరుస్తున్నారు. కాని వాస్తవానికి అదంతా గొప్ప మోసం. ఆత్మలలో కొన్ని ఆత్మల గూర్చి చెపుతాను చూడండి.

పరిశుద్ధాత్మ, (ఆదరణకర్త / ఉత్తరవాది) యోహాను 16:7, అ॥కార్య॥ 16:6

సత్య స్వరూపియైన ఆత్మ యోహాను 16:13

యషువ యొక్క ఆత్మ అ॥కార్య॥ 16:7

మెస్సీయ ఆత్మ రోమా 8:9

దత్తపుత్రాత్మ / స్వీకృత పుత్రాత్మ రోమా 8:15

ఇంద్రియ నిగ్రహముగల ఆత్మ / స్వస్థబుద్ధియు గల ఆత్మ 2తిమోతి 1:7.

మహిమా స్వరూపియగు ఆత్మ / ఎలోహీం ఆత్మ 1పేతురు 4:14.

మొదలగు ఆత్మలలో **సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును అని వాక్యం చెపుతుంది. (యోహాను 16:13)**

గుడివాడలో పెండ్లి చేసికొనని పెంతెకోస్తు పాస్టరొకడు “నేను క్రీస్తువలెను, అపోస్తలుడైన పౌలువలెను” ఉండాలనుకుని పెండ్లి చేసుకోలేదన్నాడు. చాలా మంచిది అలాగే ఉండొచ్చు, కాని నీవు ఎందుకు వెళ్ళి ఆ వేషదారణ మిషనులో దూరావు? అని అడిగాను. అపోస్తలుల సహవాసం కోసం అన్నాడు. వాళ్ళది అపోస్తలుల పరిచర్య కాదు. అది అపోస్తలుల పునాది కూడా కాదే? అన్నాను. లేదు బ్రదర్ అన్ని సహవాసములలో కన్నా అది చాలా నిష్ఠతో కూడినది. చాలా మంచి సమర్పణ గల సహవాసం అన్నాడు.

అయితే నీవు అన్నట్లే నీవు మెస్సీయ వలెను, సౌలువలెను పెండ్లి కాకుండా ఉండాలనుకున్నప్పుడు మరి నీవు మెస్సీయ మాదిరిని, సౌలు మాదిరిని అనుసరించి సబ్బాతు పాటించాలి. (లూకా 4:16, అ॥కార్య॥ 17:2) గదా? అని అడిగితే పెండ్లికాని సన్యాసికి మారుమాట రావడంలేదు. నిజంగా నీవు మెస్సీయ వలెను, సౌలువలెను జీవించాలి అనుకున్నపుడు మీసాలు, గడ్డం తీసివేయకూడదు. మద్రాసు వాడిలా లుంగీ కట్టగుండా యూదునిలా అంగీ తొడగాలి, కిప్పా పెట్టుకోవాలి. వాళ్ళు ఆచరించిన పస్కా, పర్ణశాల, పెంతెకోస్తు మొదలగు పండుగలు బైబిలు క్యాలెండరు ననుసరించి చెయ్యాలి. పెండ్లి కానివాడివి గనుక ఎవరికీ భయపడకుండా ధైర్యంగా మెస్సీయవలెను, సౌలువలెను అన్ని సంఘాల వార్కి వాక్యమును బోధించాలి గదా? అని అడిగితే ఇంకేముంది పెండ్లికాని సన్యాసి ముసుగు / వేషం ఊడిపోయి సాతానుగా

ఋజువయ్యి కేకలు వేస్తూ కొట్టడాన్కి వచ్చాడు. **వాక్యం తీసి వాళ్ళని నిలదీసి మీరు అడగండి. వాళ్ళ అసలు రూపం అప్పుడు బయటకు వస్తాది.** అడగకపోతే ఆల్‌రైట్ అడిగితే నక్స్‌లైట్ అంటారు. వాక్యం తీసి వాయిస్తే టెర్రరిస్ట్ అంటారు. అందుకే వీళ్ళంతా గుహలలో (వారి మిషను సరిహద్దులలో) జీవిస్తూ మెస్సీయనే వాళ్ళ వద్దకు రానివ్వకుండా బందిస్తూ, మెస్సీయ నామంలో బ్రతికేస్తున్నారు (యెషయా 4:1). పేరుకి, వేషానికే వీళ్ళు అపోస్తలులు గాని వాస్తవానికి వీరంతా సాతాను అనుచరులే. వేషం చూసి మోసపోకండి. వాళ్ళ బోధ ఆది అపోస్తల బోధకు సరిపోతుందో లేదో పరిశీలించండి. అమలాపురంలో ఒక పాస్టర్‌కి ఫోన్‌చేసి "ఈ రోజు మీ సంఘంలో మాట్లాడడానికి / బోధ చెయ్యడానికి వస్తాను రమ్మంటారా?" అని అడిగితే, బ్రదర్ మీరు అడగకూడదు మేము ఇవ్వకూడదు. సాక్ష్యం చెప్పుకోనిస్తాము గాని బోధ మాత్రం చెయ్యనియ్యము అన్నాడు. ఎందుకంటే వాళ్ళే వాళ్ళ మిషన్ హెడ్స్‌కి బానిసలు. ఈ రోజు ట్రాన్స్‌ఫర్ చేస్తే పెట్టెసర్దుకుని పోవాలి. ఇది వాళ్ళ గొప్ప సమర్పణ. సర్వమూ వదిలింది ఇందుకేనేమో? సత్యము చెప్పరు, సత్యము తెల్సుకోరు, సత్యవంతులుగా జీవించరు. మరి ఎందుకు వచ్చారు. వీరు సేవకు? వీరి చేసే సేవ ఏమిటి? **జీవిత కాలమంతా శరీరమును అదుపులో ఉంచుకోడానికే సమయం చాలడంలేదు. ఇక సత్యమును ఎప్పుడు చెపుతారు? సత్యమును ఎప్పుడు అంగీకరిస్తారు? పెండ్లి చేసుకోకుండా సమర్పించుకుని ఊడబొడుస్తుంది ఏముంది?** మీకన్నా మేమే బెటర్ గదా? మీరు నిజంగా విశ్వాస విషయంలో రోషం కలిగిన వారైతే మాతో బైబిల్ విషయాల్లో పోటీ పడండి. మీరు సత్యవంతులో మేము సత్యవంతులమో తేల్చుకుందాం. బైబిల్లో భక్తులు పెండ్లి చేసుకున్నారు. వాళ్ళ భార్యలు గాని, పిల్లలు గాని భక్తికి అడ్డుబండలు కాలేదు. ఉదా : చూడండి. హానోకు (ఆది 5:23),నోవాహు (ఆది 7:1), యెహోషువ (యెహోషువ 24:15), యెషయా (యెషయా 8:18), ఆది అపోస్తలులు (1కొరింథీ 9:5).

పెండ్లి చేసికొనని మీరు మెస్సీయను ఎలా సంతోషపరచాలి అంటూ ఆయనను గూర్చిన ఆలోచనలు కలిగి ఉండాలి. (1కొరింథీ 7:32). ఆ ఆలోచనలే మీకు లేవు. ఆయన మాదిరి మీకు తెలియదు. ఆయన ఎప్పుడు పుట్టాడో, ఎప్పుడు చనిపోయాడో ఆ తేదీలు కూడా మీకు తెలియవు. కనీసం ఆయన పేరు కూడా మీకు తెలియదు. ఆయన తన నోటితో చెప్పిన పేరు ఈ బైబిల్లో ముద్రించబడలేదనే సంగతికూడా మీకు తెలియదు. ఆయన నియామక కాలములు (యోబు 24:1) మీకు తెలియవు. ఆయన పండుగలు మీకు తెలియవు. ఆఖరికి పెంతెకోస్తు అని బోర్డు పెట్టుకున్నారే గాని పెంతెకోస్తు పండుగ ఎప్పుడు వస్తుందో అదీ మీకు తెలియదు. ఏమిటి మీ సమర్పణ? ఏమిటి మీ సేవ? **పెండ్లి చేసుకోకుండా నీవు చేయవలసిన బోధ, పెండ్లి చేసుకొని ఒకే ఒక్క భార్యను కలిగి ముగ్గురు పిల్లల భారం కలిగి, శరీర సంబంధమైన శ్రమలు (1కొరింథీ 7:28) కలిగి పత్రికా రూపంలో నీ హెడ్ క్వార్టర్ వరకూ బోధిస్తున్నా నేటికినీ నీవు సిగ్గులేక, మారు మనస్సులేక ఉన్నావు.** ఆది అపోస్తలుల బోధ నీకు తెలియదు గాని అపోస్తలులా నటిస్తున్నారు. ఆత్మ వివేచన జ్ఞానం ఉన్నవానిముందు మీరూ మీ బోధ తప్పని ఋజువవ్వుతుంది. పెంతెకోస్తు మిషన్ వారలారా! ఇప్పుడైనా మీతప్పుడు బోధను సరిదిద్దుకోండి. మా తల్లిదండ్రులు ఒకానొకనాడు మీద్వారా మోసపోయినవారే. మీ వేషానికే వాళ్ళు మోసపోయారు. నేను చూసేది వేషాన్ని కాదు అంతరంగాన్ని (1సమూ 16:7 + 2కొరింథీ 11:13-15 + మత్తయి 7:15-20). మీ ఫలములు అపోస్తలుల ఫలములు కావు. మీ బోధ అపోస్తలుల బోధ కాదని 100% నేను వాక్యం ద్వారా ఋజువు చేస్తాను రండి. పాఠకులారా పూర్తి వివరముల కొరకు **"పెండ్లియైన వాడు - పెండ్లికానివాడు"** అను వ్యాసము కొరకై వ్రాయండి.

**ఇప్పుడు యేసునామం వారి విషయం కూడా చూద్దాం!** వీళ్ళు కూడా అపోస్తలుల బోధ అంటూ, ఆది అపోస్తలుల బోధకు చాలా వ్యతిరేకంగా ప్రజలను మోసగిస్తున్నారు. తెలియక అజ్ఞానంవలనైతే సహించవచ్చు. కాని హృదయపూర్వకంగా మూర్ఖత్వంగా చేయడం / బోధించడం సహింపరానిది. మా ఏరియాలోనే ఒక గ్రూపు ఉంది. మోటారు సైకిల్ మీద, అక్కడక్కడ యావె / యషువ అని వ్రాసుకుంటారు. అప్పుడప్పుడు బోధలో తండ్రి నామమును ఉచ్చరిస్తూ ఉంటారు. ఆ నామమునకున్న ప్రాముఖ్యత తెలిసికూడా ఆ నామములో వాళ్ళు బాప్తిస్మములు పొందకుండా, **(ఎందుకంటే వాళ్ళ లీడర్ / నాయకుడు వేరొకని దగ్గర బాప్తిస్మం తీసుకోవడాన్కి అంగీకరించడంలేదు. సత్యము తెలిసిన వాని దగ్గర తలదించడాన్కి అయ్యగార్కి అహం అడ్డువస్తుంది).** యావె / యషువ అను నామమును ఉచ్చరిస్తూ, వారిని వెంబడించు అమాయక విశ్వాసులను యేసునామంలో ముంచివేస్తూ మోసగిస్తున్నారు. బైబిల్లో ఏ అపోస్తలుడు తెలుగు బైబిల్లో ఉన్నట్లుగా బాప్తిస్మము లివ్వలేదని చెప్పినా వినని మూర్ఖత్వము వాళ్ళలో ఉంది. విలియమ్ బ్రన్‌హామ్ బోధకు నేను కూడా ఆకర్షితుడనయ్యాను. కాని నేను ప్రతీదానిని వాక్యంతో పరిశీలిస్తూ (అ॥కార్య॥ 17:11) వచ్చేవాడిని గనుక అతి తక్కువ కాలంలోనే అది ఆది అపోస్తలుల బోధ కాదని గ్రహించాను. ఆది అపోస్తలులు యషువ మెస్సీయ నామంలోనే బాప్తిస్మములిచ్చినట్లు హెబ్రూ ఇంటర్‌లైనర్ బైబిలు రూఢి పరుస్తుంది. బ్రన్‌హామ్ టేపులు ప్రసంగాల రూపంలో ఉన్నవి విన్నాను. 300 పుస్తకాలు ఆయనవి నేను చదివాను. **అక్కడక్కడ పరిశుద్ధనామమును చెప్పేవాడు. కాని పరిశుద్ధనామములో ఎవరికీ ఎక్కడా, ఎప్పుడూ బాప్తిస్మములు ఇవ్వలేదు. అందుకే వాళ్ళ బాప్తిస్మములు కూడా వాక్యప్రకారం కాదని గ్రహించాను.** 6 సంఘకాలములు 1906 వరకూ జరిగినట్లు చిత్రించి, 7వ సంఘకాలదూతగా తన్నుతాను ప్రకటించుకున్నాడు బ్రన్‌హామ్.

| | | | | |
|---|---|---|---|---|
| 1. | అపోస్తలుడైన సౌలు | ఎఫెసు | సంఘకాల దూత | 53-170 |
| 2. | ఐరేనియస్ | స్ముర్న | " | 170-312 |
| 3. | మార్టిన్ | పెర్గమ | " | 312-606 |
| 4. | కొలంబా | తుయతైర | " | 606-1520 |
| 5. | లూథర్ | సార్దిస్ | " | 1520-1750 |
| 6. | వెస్లీ | ఫిలదెల్ఫియ | " | 1750-1906 |
| 7. | బ్రన్‌హామ్ | లవదొకియ | " | 1906-ఎత్తబడే వరకూ...... |

కాని బ్రన్‌హామ్ బోధలు వాక్యానికి చాలా వ్యతిరేకంగా ఉన్నాయి. అయితే స్వస్థతలు - అద్భుతాలు చాలా బాగా జరిగాయి గనుక ఆయన చెప్పింది సత్యమే అని వారి అనుచరుల భ్రమ, బైబిల్లో 2 బలమైన వాక్యములు ఇలాంటి మోసము నుండి మనలను రక్షించగలవు. (1) ద్వితీ 13:1-11. (2) మత్తయి 7:22-23, సహజంగా ఏదైనా ఒక వింత / విడ్డూరము జరుగుతుంటే ప్రజలు వారిని ఆకర్షించుట పరిపాటి. అ॥కార్య॥ 5:36-37, 8:9-11, పైగా మహావేశ్య సిద్ధాంతములు బోధించు సంఘములకు జన సంఖ్య చాలా ఎక్కువగానే ఉంటుంది. ప్రకటన 17:1,2+15. ఆఖరికి కొద్ది వెలుగును చూపించే పరమతండ్రి దాసుల యొద్దకు సహితం జనం తండోపతండములుగానే వెళుతూ ఉంటారు. లూకా 7:24-26. మెస్సీయ కాలంలో కూడా మెస్సీయను జనులు స్వార్థం కోసం వెంబడించారు. యోహాను 6:22-27, మత్తయి 7:136, గలతీ 4:27.

గనుక జన సమూహములను చూచి మోసపోవలసింది ఏమీలేదు. వాళ్ళబోధ ఆది అపోస్తలులది కానప్పుడు వారిని ఎవరూ వెంబడించకూడదు. ఇదే గుంపు నుండి వచ్చిన లహరి (పాలాసీర్ లారీ) గ్రూపుకూడా చాలా మోసకరమైనది. ప్రమాదకరమైనది. ఇలా బ్రన్‌హామ్ గ్రూపు, లహరి గ్రూపులు పూర్తిగా వాక్య విరుద్ధమై అపోస్తలుల బోధకు వ్యతిరేకమైయున్నది.

ఇకపోతే 1960 తర్వాత "క్రీస్తు సంఘము" అనే మతశాఖ జె.సి. బెయిలీ అనే అమెరికన్ ద్వారా ఇండియాలో ప్రవేశపెట్టబడి వాళ్ళదే ఆది అపోస్తలుల సంఘం అంటూ మిగతా సంఘాలన్నీ మతశాఖలని అబద్దములు బోధించుట ప్రారంభించబడినది. నిజానికి వాక్య సత్యమెరుగని అనేకులు డబ్బుకోసం దానిని వెంబడించారు. Pleading for the restoration of first century Christianity అనే నినాదంతో పూర్తిగా ప్రజలను నాశనమునకు నడిపించడం మొదలెట్టారు. వీళ్ళకి కూడ ఆది అపోస్తలుల బోధనా విధానం తెలియదు. పితరుల యుగం, ధర్మశాస్త్ర యుగం, క్రొత్త నిబంధనా యుగం అంటూ ఏవేవో పిచ్చిపిచ్చిగా కాలాన్ని విడగొట్టి బోధిస్తూ ఉంటారు. వాస్తవానికి ఇది తల తోక లేని పనికిమాలిక సంఘం. ఇందులోంచే **"భూ తలక్రిందులు"** అంటూ అ॥కార్య॥ 17:6 లోని భూలోకమును తలక్రిందులు చేయువారము మేమేనంటూ బయలు దేరారు కొందరు ప్రబుద్ధులు. వాస్తవానికి అ॥కార్య॥ 17:6లోని భూలోకమును తలక్రిందులు చేసినవారు సౌలు-సీలలు. సౌలు-సీలల యొక్క బోధగాని, వారి వాడుక గాని యెరుగని ఈ డూప్లికేట్‌లు కూడా మాట్లాడితే చాలెంజ్‌లు అంటూ చాలా మందిని దారి తొలగించారు. ప్రకటన 6:2లోని జయశాలిని నేనే అంటూ పి.డి.యస్. 1992లో ప్రకటించుకున్నాడు. అది సాతాను అంటే నాపై ఆయన - ఆయనగారి అనుచరులు విరుచుకుపడ్డారు. అబ్బో! ఆనాడు వారు నాపై చేసిన హడావిడి ఇంత అంత కాదు. నేడు (భూతలక్రిందులు 2006 మార్చి - ఏప్రిల్ 93వ సంచిక) "జన్మకైతే హిస్టరీ - చావుకైతే మిస్టరీ" అంటూ నాలుగు గుఱ్ఱములను వేసి మొదట తెల్లగుఱ్ఱమునకు నకిలీ అని వ్రాసారు. ఇదే విషయం 1992లో నేను పి.డి.యస్.కి స్టేజీ మీద చెపితే అంగీకరించలేదు. ఆత్మజ్ఞాని, దైవజ్ఞాని, జయశాలి అని పిలిపించుకునే పి.డి.యస్.కే ప్రకటన 6:2లోని తెల్ల గుఱ్ఱము సాతానని ఇన్ని సం॥రాలకు తెలిస్తే సామాన్య మానవునికి ఎన్ని సం॥ములు పట్టునో గదా? **ఈ డూప్లికేట్ "భూతలక్రిందులు" వారిది కూడా ఆది అపోస్తలుల బోధ కాదండి. వీరు సవాళ్ళు ఛాలెంజ్‌లు చెయ్యడమే గాని ఇంతవరకూ ఏ ఒక్కరినీ ఓడించిన దాఖాలాలు లేవండి. రీసెంట్‌గా వీరు గుతంకల్ అనంతపురం జిల్లాలో పోటీకి వెళ్ళక ఓటమి పాలయ్యిన సంగతి పాఠకులకు విధితమే.** ఎవడో డవెన్సీకోడ్ గురించి క్రైస్తవులకు అంత అవసరలెద్దు. మెస్సీయ ఏ కాలం వాడు? డవెన్సీ ఏ కాలంలో పుట్టాడు. వాడు గీసిన బొమ్మకు - మెస్సీయ గారికి అసలు సంబంధమే లేదు. వారి ఊహచిత్రం మీద ఇంత స్వంత డబ్బా / బిల్డప్ అసవరలెద్దు. మెస్సీయ గారు శరీరరీతిగా భూలోకంలో ఉన్నప్పుడే ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నారు. ఎందరో ఆయనపై బురద చల్లారు. కాని ఏదీ, ఏమీ ఆయన సవాల్‌పై (యోహాను 8:46) నిలువలేకపోయింది.

మెస్సీయకు శక్తిలేనట్లు సీమోను పేతురు ఏదో ఆయనను రక్షించే ప్రయత్నం చేసినట్లుగా మల్కు అను ప్రధాన యాజకుని దాసుని చెవిని నరికినట్లుగా, (లూకా 18:10-11) పి.డి.యస్ దుడుకుతనాన్ని ప్రయోగిస్తూ, ప్రజల్ని రెచ్చగొట్టడం ఆత్మీయతను సూచించడంలేదు. మెస్సీయ పేతురునే గద్దించాడు. (మత్తయి 26:51-54) లేఖన నెరవేర్పులను గమనించాలి గాని, దుడుకుతనము, సినీమా డైలాగులు, సాతాను ఛాలెంజీలు మనకి పనికిరావు. పేతురులా ఆలోచించి (మత్తయి 16:21-23). మెస్సీయ ద్వారా గద్దింపబడవద్దు. మనం మనుష్యుల సంగతులు ఆలోచించడం కాదు గాని ఎలోహీం సంగతులను తలంచవలసియున్నది. ఇంట్లో దొంగలను (బైబిల్ సొసైటీ వారిని) వదిలేసి, వీధిలో దొంగలను (డవెన్సీ) పట్టుకుంటే ఉపయోగమేముంది? నిజంగా మెస్సీయ మీద మీకంత గొప్ప అభిమానమే ఉంటే, **మెస్సీయ తన నోటితో చెప్పిన తన పేరు మన తెలుగు బైబిల్లో లేదు. ఒక్క హెబ్రీ బైబిల్లో తప్ప అన్ని తర్జుమాలలోను ఆయన పేరు తీసివేయబడినది.** ఇక్కడ చూపించండి తమ ప్రతాపం. ఆ పేరును ఎందుకు మరుగు చేశారో బైబిల్ సొసైటీ వారిని అడగండి. తెలుగు బైబిల్ చరిత్రను చదివితే 1818లో క్రొత్త నిబంధనను తెలుగులో అచ్చువేసినట్లును, ఎన్నో మార్పులు చేర్పులు జరిగి ఆఖరికి 1953లో అచ్చువేయబడిన బైబిలు మాత్రమే ఇప్పుడు అమలులో ఉన్నట్లు తెలుస్తుంది. (బైబిల్ సమాచారమ్ 135-143 పేజీలు) అంటే 1953 వరకు యేసు అనేపేరు తెలుగువారికి ఎవరికీ తెలియదు. **యేసుక్రీస్తు** అంటే ఒకడు ఏమన్నాడో తెలుసా! **యెశోద సుతుడైన క్రిష్ణుని స్తుతించుట** అని అన్నాడు. ఏమో! ఒకరకంగా అది నిజమేనేమో? ఎందుకంటే మన రక్షకుడు యూదుడు. ఆయనకు యూదయ పేరే ఉంటుంది గాని ఇలా తప్పుడు తర్జుమా చేసిన పేరు ఉండదు. గనుక ముందు మన ఇల్లు చక్కబెట్టి (1పేతురు 4:17,18) తర్వాత బయట చక్కబెట్టాలి. డవెన్సీ కేవలం మెస్సీయపై బురద చల్లుతున్నాడు. కాని క్రైస్తవులు డవెన్సీని మించిపోయి, తప్పులు చేస్తున్నారు. వీటిని ఎవరు అరికట్టాలి? హెబ్రోను సంఘస్థాపకుడైన భక్తసింగ్ సహితం "నిజమైన స్వాతంత్ర్యము" అనే పుస్తకంతో అపోస్తలుల బోధను తప్పుగా చిత్రీకరించారు. దొంగలను భక్తులుగాను, భక్తులను దొంగలగాను క్రైస్తవులు చిత్రీకరిస్తున్నారు. అబద్ధ బోధకులను దైవజనులుగాను, నిజమును బోధించువారిని పిచ్చి వారిగాను ప్రచారం చేయుచున్నారు. మీకన్న డవెన్సీ చాలా బెటర్. అతడు కేవలం బురద మాత్రమే చల్లుతున్నాడు. క్రైస్తవులైన మీరు క్షణ క్షణము మెస్సీయను మ్రానుకెక్కిస్తూనే ఉన్నారు.(హెబ్రీ 6:4-6) బాహాటంగా అవమానపరుస్తూనే ఉన్నారు. ఆంధ్రాలో ఒక్క బోధకుడు కూడా సత్యమును ప్రకటించుటలేదు. రేడియోల్లోను, టి.వి.ల్లోను ఎవడి బోధ వాడిదే గాని, సత్యము ఎక్కడ ప్రకటించబడుతుంది? చెప్పవలసిన నిజమైన మాట ఎవరి నోటా వినపడటంలేదు. మీరేదో గొప్ప భక్తులని ప్రజలు మీ నోటిమాట కొరకై ఎదురుచూస్తుంటే, మీరన్నీ అబద్దాలే బోధిస్తున్నారు. అసలు క్రీస్తు అనేపదం ఎక్కడ నుండి వచ్చిందో ఏ క్రైస్తవుడయినా చెప్పగలడా? క్రైస్తవ బోధకుల్లారా! మీరంతా ఈ జనాంగములను (సంఘములను) ఎక్కడికి నడిపిస్తున్నారు? మీది ఆది అపోస్తవులుల బోధ కాని పక్షమున మీరు వెలుపట ఉంచబడతారు. భూలోకంలో ఉండగానే మీ బోధ, మీ మార్గము చెక్ చేసుకోండి. అపోస్తలుల బోధ ననుసరించిన వారంతా విశ్వసించిన వారందరును ఏకహృదయమును ఏకాత్మయు గలవారై యుండిరి. అ॥కార్య॥ 4:32. ఆ ఆత్మఏది?

## భక్తిహీనులు అప్పచేసి తీర్చక యుందురు

బైబిలు వాక్యప్రకారంగా ఖచ్చితంగా చెప్పాలంటే అప్పులు చేసే వారందరూ యావె ద్వారా దీవించబడినవారు కారు. శాపగ్రస్తులు, ఆయన మాటలను అనగా ఆజ్ఞలను కట్టడలను అనుసరించి నడుచుకొననివారే అప్పులు చేస్తూ ఉంటారని వాక్యం చెపుతుంది.

**- నీ మధ్యనున్న పరదేశి నీ కంటే మిక్కిలి హెచ్చగును నీవు మిక్కిలి తగ్గిపోదువు. అతడు నీకు అప్పిచ్చును గాని నీవు అతనికి అప్పియ్యలేవు. అతడు తలగానుండును నీవు తోకగా నుందువు.** ద్వితీ 28:43,44.

**- అప్పుచేయువాడు అప్పిచ్చిన వానికి దాసుడు అని సామెతలు 22:7** చెపుతుంది.

పరమతండ్రియైన యావె ద్వారా దీవించబడినవారు "నీవు అనేక జనములకు అప్పిచెదవు కాని అప్పుచేయవు అని ద్వితీ 28:12 చెబుతుంది.

అప్పు చేసినవాడు ఎవడైనా అప్పిచ్చిన వానికి భయపడుతూనే ఉండాలి. ఆ భయాన్ని బట్టే అప్పిచ్చినవాడు కనబడగానే అప్పు తీసుకున్నవాడు నటించడం మొదలెడతాడు. ఇంట్లో ఉండి లేడనిపించడం, సెల్‌ఫోన్ రిసీవ్ చేసుకోకపోవడం, సిమ్‌కార్డులు మార్చడం, నోరు విప్పితే అబద్ధాలు మాట్లాడటం మొ॥గు మోసకరమైన పనులు చేస్తూ ఉంటాడు.

అప్పుచేసినవాడి గూర్చి బైబిలేమిచెపుతుందో చూద్దాం!

మొదటిగా అప్పులు చేసేవారు శాపగ్రస్తులనీ, ఆయన ఆజ్ఞలను అనుసరించి నడుచుకొనని వారని (ద్వితీ 28:43,44) ద్వారా గ్రహించాము.

రెండవదిగా భక్తిహీనులు అప్పుచేసి తీర్చకయుందురని కీర్తనలు 37:21 ఋజువుచేస్తుంది. అప్పు తీసుకుని తీర్చపోవడం అనునది భక్తిహీనుని లక్షణమేగాని భక్తుని లక్షణం కాదు.

భక్తిహీనులు ఎవరితో స్నేహం చేసినా, ప్రేమ నటించినా కేవలం ఎదుటివారి సొమ్మును దోచుకోవడానికే గాని తిరిగి ఇచ్చే మనస్సు వాళ్ళకుండదు.

వేశ్య తిని నోరుతుడుచుకుని ఏమీ ఎరుగను (సామె 30:20) అని అంటుందట. వేశ్యతో సహవాసం చేసే వేశ్యసంగులు కూడా అంతే. అప్పులు చేసేటప్పుడు వాళ్ళమాటలు, ఫీలింగ్స్, చూస్తే అప్పిచ్చేవారు కరిగి దయ, కనికరం చూపించి అప్పు ఇస్తారు. కాని ఈ విశ్వాస ఘాతకులు/నమ్మకద్రోహులు తర్వాత వేశ్యలా ప్రవర్తిస్తారు. ఇలాంటి నమ్మకద్రోహులు క్రైస్తవులవడం మరీ విడ్డూరం. అప్పు ఎలా తీర్చాలని బైబిలు చెపుతుందో నీతి ఉన్న క్రైస్తవుడెవడైనా ఆలోచిస్తే అప్పులు చెయ్యడాన్కి వెళ్ళడు.

– అప్పు తీర్చుటకు వానియొద్ద ఏమియు లేనందున, వాని యజమానుడు వానిని, వాని భార్యను, పిల్లలను వానికి కలిగినది యావత్తును అమ్మి అప్పుతీర్చవలెనని ఆజ్ఞాపించెను. మత్తయి 18:25. అప్పుచేసిన వాడెవడైనా ముందు వాడిని వాడు అమ్ముకోవాలి, వాడి భార్యను అమ్మాలి, వాడి పిల్లలను అమ్మాలి. తర్వాత వాడికి కలిగినది యావత్తు అమ్మాలి. అంతేగాని భక్తిహీనుడులా ఎగగొట్టడాన్కి ప్రయత్నించకూడదు, బొంకకూడదు. మనసాక్షిని చంపుకుని అబద్ధాలు ఆడకూడదు.

భక్తిగలవాడు అప్పుచేసినా ఇదే పద్ధతి అమలులో ఉంది.

**– ఇప్పుడు అప్పులవాడు నా యిద్దరు కుమారులు తనకు దాసులుగా ఉండుటకై వారిని పట్టుకొనిపోవుటకు వచ్చియున్నాడని ఎలీషాకు మొఱ్ఱపెట్టగా.....2రాజులు 4:1.**

అప్పులు చేసే అలవాటు ఉన్న భక్తిహీనుని వలన వాడికీ నష్టమే, వాడి భార్యకూ, వాడి పిల్లలకూ, వాడికున్న యావదాస్తికే నష్టమే కలుగుతుంది.

గృహము, విత్తము పితరులు ఇచ్చిన స్వాస్థం అని బైబిల్ చెపుతుంది. పిత్రార్జితము అమ్ముకోకూడదని కూడా బైబిల్ హెచ్చరిస్తుంది. ఇవే మీ అప్పులు చేసే భక్తిహీనులకు గుర్తు ఉండవు. తల్లిదండ్రులే పిల్లల కొరకు ఆస్తి కూర్చతగినది గదా! అని 2కొరింథీ 12:14 చెప్తున్నా గాని ఈ క్రైస్తవ భక్తిహీనులకు ఇలాంటి వాక్యములు మన్ననకు రావు గాని పిల్లల నోటి దగ్గరది, స్నేహితుల జేబుల్లోది, రక్త సంబంధుల, బంధుమిత్రుల బ్యాంకుల్లోది సిగ్గు/ఎగ్గు లేకుండా అడుక్కుని వేశ్యలకు ఖర్చుపెట్టేటపుడు ఉండదా క్రైస్తవ నీతి?

తల్లిదండ్రులుగా మీ పిల్లలకు మీరే మీ ఇవ్వలేదు గాని, ఆఖరికి వాళ్ళతాతలు సంపాదించింది కూడా అమ్మేసుకుని పిల్లలను, భార్యను అనాధలుగా చేసే మీకు నీతి ఎక్కడుంది? అప్పులు చేసుకుంటూ బ్రతికే ఎవడికీ అప్పిచ్చిన వానిపై తిరుగుబాటు చేసే అధికారం ఉండదు. వాక్య ప్రకారం నీవు అప్పు తీసుకున్నవానికి దాసుడవు (సామెతలు 22:7) నీవు పొరపాటును అంగీకరించడమే తప్ప (మత్తయి 18:26) పొగరుగా మాట్లాడకూడదు. అప్పుతీర్చడాన్కి ప్రయత్నించాలేగాని (2రోజులు4:7) గాని భక్తిహీనుడిలా అప్పుచేసి తీర్చకుండా ఉండకూడదు (కీర్తనలు 37:21) ముఖ్యంగా ధర్మశాస్త్ర ప్రకారం వడ్డీలేని అప్పు తీసుకుంటే అసలే ఎగగొట్టడాన్కి ప్రయత్నించకూడదు. అది ఒక వేళ పరమతండ్రి సొమ్మయితే దానికి ఎంత కలిపి చెల్లించాలో బైబిల్లోనే ఉంది చదువుకో. నాబాలులా (1సమూయేలు 25:2–37) మేలు మరిచి కీడు చెయ్యడాన్కి ప్రయత్నిస్తే పరమతండ్రి ఉగ్రత ద్వారా బిగిసిపోగలవు. పరమతండ్రి నిన్ను బాధించువాడికి అప్పగించక ముందే (మత్తయి 18:34) అప్పులు బారినుండి బయటకురా. ఊరి నిండా అప్పులు చేసి బ్రతుకుతూ, అప్పుల వాళ్ళకు జడిసి ఇంట్లో దూరితేనే నీ బ్రతుకు ఏమిటో అర్థం అవుతుంది. ఫరోలా మనస్సును కఠినపర్చుకుని బ్రతకకు. కనీసం పశ్చాత్తాపం లేని వానివలె జీవించకు (మత్తయి 21:32). నేడైనా మారుమనస్సు పొంది నీ జారత్వాన్ని వదిలిపెట్టు (ప్రకటన 2:21) మారుమనస్సును తగిన ఫలములు ఫలించు. ఇచ్చకపు మాటలు మాట్లాడుతూ, మనుష్యులను బలే మోసం చేయగలుగుతున్నాను అని భ్రమపడుతున్నావేమో! జీవము గల ఎలోహీం చేతిలోపడుట భయంకరం (హెబ్రీ 10:31) నీవు ఎన్ని వెధవ పనులు చేస్తున్నా దేవుడు నీ పక్షంగా ఉన్నాడని (ద్వితీ 29:91,20) సొల్లు కబుర్లు చెప్పకు. హృదయంతరంగాన్ని ఎరిగిన తండ్రి ముందు నీపై రూపం పనికిరాదు (1సమూ 16:7). నీవు ఎంత భక్తినటించినా, నీ క్రియలు నీవెవరివో ఋజువుపరుస్తూనే ఉన్నాయి.

**– ఎలోహీంను ఎరుగుదుమని వారు చెప్పుకొందురుగాని, అసహ్యులును, అవిధేయులును ప్రతి సత్కార్యము విషయము భ్రష్టులునైయుండి తమ క్రియల వలన ఆయనను ఎరుగమన్నట్టున్నారు. తీతు 1:16. సత్క్రియలు చేసేవాడే తలపైకి ఎత్తుకుని జీవిస్తాడు. (ఆది 4:5–7)**

**అప్పులకు పూటబడువారితో చేరకుము చెల్లించుటకు నీ యొద్ద ఏమియు లేకపోగా వాడు నీ క్రింద నుండి నీ పరుపు తీసుకొనిపోనేల? – సామెతలు 22:26,27.**

## యావె భక్తి గల స్త్రీ – దయ్యపు స్త్రీ

| | |
|---|---|
| సామెతలు : 5:18,19 | నీ యవ్వనకాలపు భార్యయందు సంతోషింపుము. ఆమె అతిప్రియమైన లేడి, అందమైనదుప్పి. ఆమెరొమ్ములవలన నీవు ఎల్లప్పుడు తృప్తినొందుచుండుము. ఆమె ప్రేమచేత నిత్యము బద్ధుడవై యుండుము. |
| సామెతలు 5:16 : | నెనరుగల స్త్రీ ఘనతనొందురు. |
| సామెతలు 12:4 : | యోగ్యురాలు తనపెనిమిటికి కిరీటము. |
| సామెతలు 14:1 : | జ్ఞానవంతురాలు తన ఇల్లుకట్టును. |
| సామెతలు 18:22 : | భార్య దొరికిన వానికి మేలు దొరికెను. అట్టివాడు యావె వలన అనుగ్రహము పొందినాడు. |
| సామెతలు 19:14 : | సుబుద్ధిగల భార్య యావె యొక్క దానము. |
| సామెతలు 13:10 : | గుణవతిగల భార్యదొరుకుట అరుదు. అట్టిది ముత్యము కంటే అమూల్యమైనది. |
| ప్రసంగి 9:9 : | ఎలోహీం నీకు దయచేసిన నీ ఆయుష్కాలమంతయు నీవు ప్రేమించు నీభార్యతో సుఖించుము. నీవ్యర్థమైన ఆయుష్కాలమంతయు సుఖించుము. ఈ బ్రతుకునందు నీవుకష్టబడి చేసికొనినయంతటికి అదే నీకుకలుగు భాగము. |

**స్త్రీకి ఎలోహీం యొక్క శాపము :** ఆయన స్త్రీతో నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో పిల్లలను కందువు; నీ భర్తయెడల నీకు వాంఛ కలుగును; అతడు నిన్ను ఏలునని చెప్పెను. ఆదికాండం 3:16.

**భార్య అంటే ???**

| | | |
|---|---|---|
| 1. | భర్తకు సాటియైన సహాయము. | ఆది 2:18 |
| 2. | కవిత్వాన్ని వ్రాయించగల ప్రేమమూర్తి. | ఆది 2:23 |
| 3. | భర్త కంటికి ఇంపైనది. | యెహెజ్కేలు 24:16–18 |
| 4. | హత్తుకొనబడేది, ఏకశరీరి, దిగంబరియై సిగ్గునెరుగనిది. | ఆది2:24–25 |
| 5. | భర్తను గౌరవించి,తన దుఖాన్ని నివారించేది. | ఆది 24:65–67 |
| 6. | సరసమాడబడేది. | ఆది 26:8 |
| 7. | చస్తాను అని దెబ్బలాడే చనువు గలది. | ఆది 30:1 |
| 8. | బాధలను మర్చిపోయేలాచేయగలిగినది. | ఆది 41:50–52 |
| 9. | భక్తిమార్గంలో భర్తకు సహకరించేది. | లూకా 1:5,6, అ॥కార్య॥ 18:26 |
| 10. | భర్తద్వారా తప్పుజరగకుండాచూచేది. | మత్తయి 27:19, 1సమూ25:23-32. |
| 11. | భర్తకు మేలేతప్ప, కీడుచెయ్యనిది. అంతేకాదు భర్తద్వారానమ్మబడేది. | సామెతలు 31:11. |
| 12. | భర్త చనిపోయినా అత్తవారిని హత్తుకొని ఉండేది. | రూతు 1:14–18 |
| 13. | అవిశ్వాసియైన భర్తను విశ్వాసిగా మార్చగలిగేది. | 1కొరింథీ 7:13,14 |
| 14. | యావె జనుల పట్ల శ్రద్ధాభక్తులు కనపరచేది. | 2రాజులు 4:8–377 |
| 15. | యావె జనుల సలహాలను పాటించునది. | 1రాజులు 1:11–53. |
| 16. | భర్తద్వారా ఎక్కువగా ప్రేమించబడేది. | ఎస్తేరు 2:17. |

గమనిక : ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఇట్టి లక్షణములు కలిగిన స్త్రీని భార్యగా పొందిన పురుషుడా!

ఆమె పట్ల నీవు విశ్వాసఘాతంగా ఉండవద్దు. (మలాకీ 2:14–16)

ఆమెను నిష్ఠురపెట్టవద్దు (కొలస్సీ 3:19), ఆమెను ఎడబాయవద్దు (1కొరింథీ 7:5)

ఆమెను ప్రేమించు (ఎఫెస్సీ 5:25), కామాభిలాషయంద మాత్రమేగాక ఘనతయందు సన్మానించు (1థెస్స 4:3–5) బలహీనమైన ఘటమని ఎరిగి జ్ఞానంతో కాపురంచెయ్యి (పేతురు 3:7), ఏకశరీరమని ఋజువుచెయ్యి (ఆది 2:24). ఆయన భార్యతన్ను తాను సిద్ధపరచుకొనియున్నది. ప్రకటన 19:7.

**దయ్యపు స్త్రీ :**

| | |
|---|---|
| ప్రసంగి 7:26 | : మరణముకంటే ఎక్కువ దుఃఖము కలిగించునది ఒకటి నాకు కనబడెను అది వలలవంటిదై, ఉరులవంటి మనస్సును బంధకముల వంటి చేతులును కలిగిన స్త్రీ. ఎలోహీం దృష్టికి మంచి వారైన వారు దానిని తప్పించు కొందురు గాని పాపాత్ములు దానివలన పట్టబడుదురు. |
| సామెతలు 11:22 | : వివెకము లేని స్త్రీ పందిముక్కునున్న బంగారు కమ్మి వంటిది. |
| సామెతలు 14:1 | : మూఢురాలు తన చేతులతో తన ఇల్లు ఊడబెరుకును. |
| సామెతలు 19:13 | : భార్యతోడిపోరు ఎడతెగక పడుచుండుబిందువులతో సమానము. |
| సామెతలు 21:9 | : గయ్యాళితో పెద్దఇంటనుండుటకంటే మిద్దెమీద నొకమూలను నిశించుట మేలు. |
| సామెతలు 21:19 | : ప్రాణము విసిగించు జగడగొండిదానితో కాపురము చేయుటకంటే అరణ్యభూమిలో నివశించుట మేలు. |
| సామెతలు 27:15 | : ముసురుదినమున ఎడతెగక కారునీళ్ళును గయ్యాళియైన భార్యయు సమానము. |

**ఇట్టి భార్య లేక స్త్రీ**

1. అందగత్తే కాని భర్తమాట వినదు. భర్త పరువు, గౌరవము, మర్యాదలు మంట గలిపేస్తాది. ఎస్తేరు 1:12,17.
2. భర్తను సిగ్గు పరుస్తాది. సామెతలు 1:4
3. భర్త భక్తుడైతే అతనిని వెంబడించదు. ఆది 19:26, యోబు 2:9+19:17
4. భర్తను ఏడిపిస్తాది. స్థిరంగాకాపురంచెయ్యదు. 2సమూ 3:16
5. భర్తకు తెలియకుండా పాడుపనులు చేస్తాది. సామెతలు 7:19,20
6. పోకిరీచూపులుచూస్తూ పరులను హత్తుకుంటాది. హోషియ 2:3.
7. భర్త ద్వారా తప్పులుచేయ్యిస్తాది. భర్తస్థానం ఆక్రమిస్తాది. ఆదికాండం 3:6,12+1రాజులు 21:5–16.
8. భర్తని వ్యభిచారానికి పురుకొల్పుతాది. తన ఇంటికి తనే చిచ్చుపెట్టుకుంటాది. ఆదికాండం 16:1–14.
9. భక్తులైన అత్తమామలకు మనోవేదన కలుగజేసి వారి ప్రాణాలను విసిగించివేస్తాది. ఆదికాండం 26:34,35+27,46.
10. పరాయి పురుషులపై కన్నువేసి భర్తకి ద్రోహం చేస్తాది. భర్తకి అబద్ధాలు చెప్పి నమ్మిస్తాది. ఆదికాండం 39:7+14+17,18
11. భర్తకి తప్పుడు సలహాలు ఇస్తాది. తప్పులు చెయ్యిస్తాది అతని తప్పులతో ఏకీభవిస్తాది. ఎస్తేరు 5:11–14, అ॥కార్య॥ 5:1–11.
12. పుట్టింటికి పురుగెడుతూ ఉంటాది. రూతు 1:15.
13. ప్రాణం విసిగించివేస్తాది. మగవాడిని చంపేస్తాది. మగవాడిని నమ్మించి గొంతుక కోసేస్తాది. ప్రేమకై పరిగెడితే తిరస్కారంతో త్రోసివేస్తాది. న్యాయాధి 16:16+ ప॥గీ॥ 8:7
14. మగవాడిని నాశనం చేసే వరకూ అది వదలదు. సామెతలు 7:25–27
15. మంచి భర్తను తప్పుడు మార్గానికి మళ్ళిస్తాది. 1 రాజులు 11:4
16. భక్తి మార్గంలో కూడా వేషం ధరిస్తాది. (1రాజులు 14:1–13) యావె జనులతో విరోధం పెట్టుకుంటాది. (1రాజులు 19:1–2) మగవాడితో సమానం అంటాది. (సంఖ్య 12:2) సాతానుతో ఏకీభవిస్తూ ఉంటాది. (1 తిమోతి 2:14)

గమనిక : ఇవి కూడా కేవలం కొన్ని ఉదాహరణ మాత్రమే.

"హవ్వమ్మే ఆధారం, మన కథ అక్కడే ఆరంభం. హవ్వమ్మే సంతోషం; ఆదాముకు హవ్వమ్మే సంతాపం."

మెస్సీయ ప్రేమ అందరి ప్రేమల కన్నా చాలా విలువైనది. భూలోకంలోని ఈ ప్రేమలన్నిటికీ అంతం ఉంది గాని అంతం లేని ప్రేమ మెస్సీయాదే! మానవ ప్రేమలు ఏడిపిస్తాయి. సంతోషపరుస్తాయి. గాయపరుస్తాయి. చంపుతాయి గాని మెస్సీయ ప్రేమ శాశ్వతమైనదిగి నిలిచిపోతూ నిలకడగా ఉంటాది. అట్టి ప్రేమను పొంది ఆనందంగా జీవించగలిగిన వారే నిజమైన యావె బిడ్డలు.

**"అగాధ సముద్ర జలము ప్రేమను ఆర్పజాలదు నదీ ప్రవాహములు దాని ముంచివేయజాలవు."**